క్లుప్తంగా

పెదకూరపాడులో భారీ వర్షం



పెదకూరపాడు: పెదకూరపాడులో మంగళవారం ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన వీధులన్నీ చెరువు తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లో పత్తి, మిరప పంటలు నీట మునిగాయి. పెదకూరపాడు, అమరావతి మధ్య కాలచక్ర రోడ్డుపై ఉన్న పేరమ్మవాగు, నీరుకుంట, కంభంపాడు వద్ద ఎద్దువాగు పొంగిపొర్లడంతో కొంత సేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

పశుపోషకులకు రుణాలు

రాజుపాలెం: అమూల్ పాలకేంద్రాలలో పాలు పోసే రైతులకు జీడీసీసీ బ్యాంక్ ద్వారా సబ్సిడీపై పశువులు కొనుగోలు చేసుకునేందుకు రుణాలు ఇప్పిస్తామని పశువైద్యాధికారి వీరయ్య తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న పాలవెల్లువపై సర్పంచ్ పులిబండ్ల అశోక్ అధ్యక్షతన రుణమేళా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ అమూల్ పాలకేంద్రాలలో పాలుపోస్తూ నకరికల్లు జీడీసీసీ బ్యాంక్ ద్వారా నగదు తీసుకునే రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్‌వారు ముందుకు వచ్చినట్లు తెలిపారు. నాలుగు శాతం వడ్డీతో మేతకు, ఇన్సూరెన్సుకు, మందులకు రూ.30వేలు ఇస్తారని, ఏడాది లోపు చెల్లించాలని తెలిపారు. అదేవిధంగా పశువులు కొనుగోలు చేసుకునేందుకు రూ.91వేలు, ఆవుల కొనుగోలుకు రూ.74వేలు 11శాతంతో ఇస్తారని తెలిపారు. ఐదేళ్లలోపు చెల్లించాలని తెలిపారు. పాలుపోసే రైతు స్థాయిని బట్టి నాలుగు గేదెల వరకు ఇస్తారని తెలిపారు. ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

రాజుపాలెం: ఉద్యాన పంటలకు ఈ-క్రాప్ నమోదు త్వరగా పూర్తి చేయాలని ఉద్యాన అధికారి డి.నవీన్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండలంలోని రాజుపాలెం, కోటనెమలిపురి గ్రామాలలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బంతి, కూరగాయల పంటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు.

పోషకాహార మాసోత్సవాలు



పెదకూరపాడు: పెదకూరపాడులోని ఏడో అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి సీడీపీఓ స్వర్ణకుమారి హాజరై తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం గురించి బాలింతలు, గర్భిణులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం బలవర్ధక ఆహారం అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆహారం తీసుకోవాలని కోరారు. విద్యార్థుల బరువు, ఎత్తు చూశారు. సూపర్‌వైజర్ షేక్ మున్ని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-ఆశా యాప్‌పై అవగాహన

ముప్పాళ్ల: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశ కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సీహెచ్‌ఓ ఆంజనేయులు మాట్లాడుతూ తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్, హైరిస్క్ గర్భిణులు, బాలింతలకు అందించాల్సిన సేవలపై అవగాహన కల్పించారు. ఈ-ఆశ యాప్‌లో నమోదు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీ సక్రమంగా చేపట్టాలని సూచించారు. ఆరోగ్యశ్రీ ద్వారా గర్భిణులకు టిఫా స్కాన్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని, ఆమేరకు సేవలు అందించాలని సూచించారు. సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, ఎం.జోస్పిన్‌రాణి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో లేగదూడకు గాయాలు

నాదెండ్ల: గ్రామాల్లో రోజు రోజుకు వీధి కుక్కల బెడద ఎక్కువౌతోంది. మేజర్ పంచాయతీ గణపవరంలో గడిచిన కొద్ది నెలల క్రితం సుమారు 10 దూడలు కుక్కల దాడిలో మృతి చెందగా, మరో రెండు చోట్ల గొర్రెల పాకలో చొరబడి గొర్రె పిల్లలను చంపి తినేసిన సంఘటనలు జరిగాయి. తాజాగా సోమవారం అర్ధరాత్రి పశువుల ఆసుపత్రి వీధిలో ఉన్న రైతు పెదవల్లి రామారావుకు చెందిన లేగదూడపై వీధికుక్కలు దాడి చేశాయి. దీంతో లేగదూడకు గాయాలు కాగా కుడి చెవిని పూర్తిగా తినేశాయి. లేగదూడ అరుపులకు రైతుల రామారావు అక్కడకు చేరుకుని కుక్కలను తరిమేశాడు. మంగళవారం ఉదయం స్థానిక పశువుల ఆసుపత్రిలో వైద్యం చేయించారు. కుక్కల బెడదను నివారించాలని పంచాయతీ అధికారులను ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

టీచర్స్‌డే వేడుకల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానమనే దారి చూపి జీవితాల్లో దార్శనీకులు ఉపాధ్యాయులు అని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని పెదకూరపాడులోని శ్రీచైతన్య స్కూల్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మొదట చైతన్య స్కూల్ నూతనంగా నిర్మించిన తరగతి గదులను ఎమ్మెల్యే శంకరరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత గురువుల పాత్ర కీలకమన్నారు. గురువులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతోపాటు, వారిలో మంచి భావాలు పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం భావితరాల భవిష్యత్తు కోసం పాఠశాలల్లో అనేక మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. వేల కోట్లు ఖర్చు చేసి పాఠశాలలను అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలందించిన నియోజకవర్గానికి చెందిన 20 మంది ఉపాధ్యాయులను ది చైల్డ్ షఫర్డ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, విద్యార్థులు, పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ల: మండలంలోని పలు పాఠశాలల్లో గురుపూజోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులను విద్యార్థులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి వారి దీవెనలు తీసుకున్నారు. ముప్పాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కె.నాగేంద్రమ్మ, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: భవిష్యత్‌కు పునాదులు వేసే గురువులే మార్గ నిర్దేశకులను, అలాంటి గురువులకు తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని ఎంఈఓ ఆర్.నరసింహారావు అన్నారు. మండలంలోని తాడువాయి పంచాయతీ, గిరిజన తండాలోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణానాయక్ మాట్లాడుతూ మారుమూల గిరిజన తండాలకు సైతం వచ్చి తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే గురువులను సత్కరించడం తమ అదృష్టంగా భావిస్తామన్నారు. తండా పెద్ద వెంకటేశ్వర్లునాయక్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని, వారి కృషితోపాటు విద్యకు కీలకమైన ఉపాధ్యాయుల తోడ్పాటువల్లనే పొలాలలో కూలి పనులకు వెళ్లేవారు సైతం తమ పిల్లలను ఇప్పుడు పాఠశాలలకు పంపగలుగుతున్నారన్నారు. తొలుత భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం ఎ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు ఐ.శ్రీనివాసరావులను గ్రామపెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. గిరిజన తండా పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: మండల వ్యాప్తంగా గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. పెదకూరపాడు జెడ్పీ పాఠశాల, 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల,



ఎంఈఓలు కె.బాబురెడ్డి, ఎంఎల్ఎన్ ప్రసాద్‌లను సన్మానిస్తున్న హెచ్‌ఎం స్వామి, ఉపాధ్యాయులు

గారపాడు జెడీప పాఠశాల, కాకతీయ విద్యా సంస్థలు, అభినందన ఎడ్యుకేషన్ సొసైటీ, సెయింట్ ఆన్స్, పలు ప్రాథమిక పాఠశాలల్లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు.

సమాజానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులు..

నకరికల్లు: సమాజానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులని ఎంఈఓలు కె.బాబురెడ్డి, ఎంఎల్ఎన్ ప్రసాద్‌లు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం, గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మార్పీ కార్యాలయంలో ఎంఈఓలను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీతలైన ఎంఈఓలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని అన్నారు. నేటి చిన్నారులను రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే మహత్తర బాధ్యత ఉపాధ్యాయులకు ఉందని కొనియాడారు. అనంతరం గతేడాది ఉత్తన ప్రధానోపాధ్యాయునిగా అవార్డు పొందిన మేదరమెట్ల స్వామిని అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రగతి సీబీఎస్ఈ స్కూల్లో..

సత్తెనపల్లి: దేశానికి ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర వహిస్తారని ప్రగతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ మక్కెన అచ్చయ్య అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని ప్రగతి సీబీఎస్ఈ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి బహుమతులను అందజేశారు. విద్యార్థులు వారి ఉపాధ్యాయులకు నమస్కరించి ఆశీర్వాదాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అచ్చయ్యను సత్కరించారు. కార్యక్రమంలో ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్ మక్కెన పద్మజ, శ్రీలత, వ్యాయామ ఉపాధ్యాయులు ఆదం షఫీ, శ్రీకాంత్, సలీం, ఇన్‌చార్జ్ ఉమాశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



పెదకూరపాడులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

క్రోసూరులో...

క్రోసూరు: ప్రపంచంలో విద్యార్థులకు గురువులే దిశనిర్దేశకులని సెయింటాన్స్‌పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ మేరీ రజిత అన్నారు. క్రోసూరులోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థుకు గురువుల విశిష్టతను తెలియచేసారు. క్రోసూరు సెయింటాన్స్ పాఠశాలలో గురుపూజోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ మేరీ రజిత మాట్లాడుతూ ప్రతి గురువు తమ శిష్యులు తమ కన్నా ఉన్నతమైనా స్థానాలకు ఎదగాలని మనసారా కోరుకుంటారని, సమాజంలో గౌరవాన్ని దక్కించుకుంటే అదే గర్వకారణంగా భావిస్తారని అన్నారు. తొలుత భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సిస్టర్ లిల్లీ, విజయ్ కుమార్, బురాన్, పద్మ, పాల్గొన్నారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: చదువే వ్యక్తిని ఉన్నత స్థానంలో నిలుపుతుందని బెల్లంకొండ ఎంఈఓ బి.రాజకుమారి తెలిపారు. మంగళవారం మండంలోని అన్నీ గ్రామాలలో పాఠశాలలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో జరిగిన వేడుకలలో ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గురువుల యెడల గౌరవ మర్యాదలతో మెలగాలని సూచించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో....

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ బి.ఉమాదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రత్నకుమారి, సత్యప్రభ, రమేష్‌బాబు, అంకమ్మరావు పాల్గొన్నారు.



డాక్టర్ అచ్చయ్యను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



బెల్లంకొండ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

వేగవంతంగా సమగ్ర భూసర్వే పనులు

- జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్
- క్రోసూరు మార్కెట్‌యార్డులో వీఆర్‌ఓలు, సర్వేయర్లకు అవగాహన

క్రోసూరు: జగనన్న సమగ్ర భూసర్వే పనులను వీఆర్‌లు, గ్రామ సర్వేయర్లు వేగవంతంగా పూర్తిచేయాలని, అందుకు ఆయా గ్రామాల రైతుల సహకారం తీసుకోవాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. క్రోసూరులోని మార్కెట్ యార్డులో మంగళవారం వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్రోసూరు మండలంలో రెండవ విడత సమగ్ర భూసర్వే పనులకు మండలంలోని ఊటుకూరు, విప్పర్ల, అనంతవరం, గరికపాడు, అందుకూరు, బాలెమర్రు గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు. సర్వే చేయబోయే ప్రతి గ్రామంలో ముందుగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రీ సర్వేకు సహకరించి స్వాధీన పత్రాలు పొందాలని రైతులకు చెప్పాలని తెలిపారు. 1906 బ్రిటిష్ కాలం నాటి సర్వే 1921 ఆర్ఎస్ఆర్ ప్రకారమే ఇప్పటి వరకు భూములు కొలుస్తున్నట్లు తెలిపారు. 100 సంవత్సరాల నాటి సర్వేలో ఎన్నో సమస్యలు, వివాదాలు వస్తుండటంతో ప్రభుత్వం దానిస్థానంలో సమగ్ర రీ సర్వే పనులు అత్యంత పారదర్శకంగా చేపట్టిందన్నారు. పూర్తి ఆన్‌లైన్ ద్వారా భూమి కొలతలు వస్తాయన్నారు. దానితో పాటు ఎల్‌పీఎస్‌తో జియో ట్యాగింగ్ పనులు జరుగుతాయన్నారు. పాత హద్దురాళ్ల తొలగిపోతాయన్నారు. ఇక భూమి కొలత స్పష్టంగా ఆన్‌లైన్‌లో చెక్కుచెదకుండా, వివాదాలు లేకుండా, సమస్యలు రాకుండా గుర్తిస్తామన్నారు. ఈ నెల ఎనిమిదవ తేదీన రోవర్సు వస్తాయన్నారు. గ్రామానికి రెండు టీములు ఏర్పడి రోజుకు 100 ఎకరాలు భూమిపై హక్కు దారులను గుర్తించటం లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలన్నారు. తదుపరి పనులు త్వరితంగా పూర్తిచేయాలన్నారు. ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దార్ ఎండీ జియాలవుల్ హక్, డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

భూసర్వేకు రైతులు సహకరించాలి..

రాజుపాలెం: భూసర్వే బృందానికి రైతులు సహకరించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సమగ్ర భూ సర్వేపై సర్వేయర్లతోను, వీఆర్వోలతో జేసీ సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి చౌటపాపాయపాలెం, రాజుపాలెం (బ్రాహ్మణపల్లి), రెడ్డిగూడెం(మొక్కపాడు) గ్రామాలలోని 7677 ఎకరాలలో రీ సర్వే ప్రారంభిస్తారని తెలిపారు. సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ రాజకుమారి, తహసీల్దార్ ఎ.బేగం, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే టి.విజయ్‌కుమార్, డీటీ నళిని పాల్గొన్నారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలలో కొద్ది రోజులలో ప్రారంభమవబోతున్న రీ సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ రాజకుమారితో కలసి రీ సర్వేపై రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మండలంలోని వన్నాయపాలెం, పాపాయపాలెం, మాచాయపాలెం గ్రామాలకు ఓఆర్ఐ మ్యాప్ రావడం జరిగిందన్నారు. కొద్ది రోజులలో ఈ మూడు గ్రామాలలో ముందుగా రీ సర్వే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఓట్ల తొలగింపుపై టీడీపీ తప్పుడు ఆరోపణలు





ఓట్లు తొలగించారని ఆందోళన చేసినవారు గుంటూరు 54వ డివిజన్ ఓటర్లు అని రుజువు చేసే ఓటరు లిస్టు

ఆధారాలతో నిరూపించిన వైఎస్సార్ సీపీ నాయకులు

అమరావతి: ప్రజలలో వైఎస్సార్ సీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తమ సానుభూతి పరుల ఓట్లు తీసేస్తున్నారని టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తూ, అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మదమంచి సతీష్, సింగబనేని నర్సయ్యలు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని అత్తలూరులో కాకుండా ఇతర ప్రాంతాలలో నివాసం ఉంటూ అక్కడ ఆధార్ కార్డులు, ఓట్లు నమోదు చేయించుకున్న వారి ఓట్లను మాత్రమే తీసి వేయటం జరిగిందన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసి వారిలో చల్లా పెద కోటేశ్వరరావు, అతని భార్య అంకాలు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 54వ డివిజన్‌లో ఓటర్లుగా నమోదు చేయించుకున్నారన్నారు. చల్లా బాలశౌరి, అతని భార్య దుర్గమ్మలకు కూడా గుంటూరు 54వ డివిజన్‌లో ఓట్లు ఉన్నాయన్నారు. అలాగే కుంభా శ్రీనివాసరావు అతని భార్య పోలేరమ్మలు తాడికొండ నియోజవర్గం బందారుపల్లిలో, బత్తుల వెంకటరావు పెదకూరపాడు మండలం కంభంపాడులో, ఘట్టమనేని పునీత అబ్బరాజుపాలెంలో, మాదినేని భ్రమరాంబ, బొల్లినేని పద్మ బుచ్చయ్యపాలెంలో, గంటా లావణ్య, గంటా సుధీర్ అచ్చంపేట మండలం రుద్రవరంలో, బెల్లంకొండ నాగరాణి, బెల్లంకొండ అమలరాజులు తిరుపతి నియోజవర్గంలో ఓట్లు కలిగి ఉన్నారన్నారు. అలాగే బత్తుల శ్రీనివాసప్రసాద్‌కు పెదకూరపాడులో, మాదినేని నాగభూషణం, వెంకటనర్సమ్మలకు తెలంగాణ రాష్ట్రంలోని పినపాక నియోజకవర్గంలోని గొల్లగూడెంలో ఓట్లు ఉన్నాయన్నారు. టీడీపీ నాయకులు ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేక కాలక్షేపం కోసం తప్పుడు ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. అత్తలూరులో ఓట్లపై అధికారులు సమగ్రంగా విచారించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు, అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలలో అభిమానం సాధించిన తమకు టీడీపీ ఓట్లు తొలగించాల్సిన అవసరం లేదన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన

వెలగపూడిలో సీసీ రోడ్లు, డ్రెయిన్‌లకు భూమిపూజ చేసిన కత్తెర సురేష్ కుమార్


వెలగపూడి(తాడికొండ): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలో రూ.40 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ లోటు ఉన్నప్పటికీ దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా విద్య, వైద్యం, ప్రజా సేవలకు ప్రథమ ప్రాధాన్యత నిస్తూ గ్రామాల్లో ఇప్పటికే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌లు, నాడు - నేడు ద్వారా పాఠశాలల ఆధునికీకరణ, పేదలకు జగనన్న కాలనీలలో స్థలాలు అందులో పక్కా ఇళ్ల నిర్మాణం, ఇలా పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ఇకపై అంతర్గత సమస్యలపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. జగనన్న చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విష ప్రచారం చేయడం దుర్మార్గమని, గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి గడపలో పేదవాడి సంతోషాన్ని చూసిన మాకు రాష్ట్రంలో 175/175 స్థానాల్లో విజయం సాధిస్తామనే ధీమా ఉందన్నారు. తాడికొండ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల శేషగిరావు, శృంగారపాటి సందీప్, చలివేంద్రం సురేష్, రమణా రెడ్డి, ఆరేపల్లి జోజి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

ఎస్సీ వర్గీకరణకు సహకరించండి

పెదకూరపాడు: రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు సహకరించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును వినతి పత్రం అందజేశారు. కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావును మంగళవారం కలిసినట్లు ఆయన వెల్లడించారు. వర్గీకరణకు అనుకూలంగా రాబోయే పార్లమెంట్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా మహాజన సోషలిస్టు ప్రధాన కార్యదర్శి కంచర్ల జాన్‌బాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అచ్యుత రావు, ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబు, కోటి, ఎమ్మార్పీఎస్ నాయకులు నంబూరు శ్రీనివాసరావు, స్వామి, కె.మరియదాసు, వి.మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నంబూరు శంకరరావును కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రేపు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి, ఉట్టి ఉత్సవాలు జరుగుతుతాయని శ్రీవారి సేవా సమాజం సభ్యులు మంగళవారం తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

బాల్య వివాహాలు నిర్మూలిద్దాం

అమరావతి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాల్య వివాహాలు నిర్మూలించి, బాలల హక్కులు కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యతని గుడ్‌షెఫర్డ్ సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నరసి అన్నారు. మంగళవారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ మీటింగ్ హాల్‌లో బాల్య వివాహాలపై బాలల హక్కులపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంస్థ కో-ఆర్డినేటర్ లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈసదస్సులో సుపీరియర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ బాలల హక్కులు, చైల్డ్‌లైన్ 1098 గురించి వివరించారు. రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లలకు 24 గంటలు సహాయపడే ఉచిత టెలిఫోన్ నెంబర్ 1098 కి ఫోన్ చేయవచ్చన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అన్ని విధాలుగా చదువుకోవడానికి అవకాశాలు కల్పిస్తుందని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను సంస్థ నిర్వహిస్తుందని, విద్యార్థులను ఈ కోర్స్‌లలో చేర్పించి, వారికి ఉపాధి లభించే విధంగా చూడాలన్నారు. సంస్థ సిబ్బంది బత్తుల బాబు పవన్, మరియమ్మ, బ్యూలా, పలువురు మహిళలు పాల్గొన్నారు

అమరేశ్వరునికి పవిత్రాలు సమర్పణ



అమరేశ్వరస్వామికి సమర్పించేందుకు పవిత్రాలను తీసుకు వెళుతున్న దృశ్యం

అమరావతి: అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాలలో రెండవ రోజు మంగళవారం శాస్త్రోక్తంగా మండప పూజ, దీక్ష హోమం, రుద్ర హోమం, పవిత్ర ధారణ, చండీహోమం, దీక్ష హోమం, హారతి మంత్ర పుష్పాలు నిర్వహించారు. అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీదేవికి, 18 ఉపాలయములలో పట్టు పవిత్రాలు సమర్పించి రుద్ర హోమం, చండిహోమం, విశేష హోమాలు నిర్వహించారు. అలాగే బ్రహ్మశ్రీ పీసపాటి నాగేశ్వరశర్మ ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. ఈసందర్భంగా ఆలయ కార్యానిర్వాహణాధికారి వేమూరి గోపినాథశర్మ మాట్లాడుతూ విజయవాడకు చెందిన యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అమరేశ్వరునికి వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. దేవాలయాల్లో చేసే నిత్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు, నిత్య ఉత్సవాలలో నిత్య కల్యాణం, నిత్య రుద్ర హోమాలు, నిత్యపూజా కార్యక్రమాలలో జ్ఞాతా జ్ఞాతములైన మంత్ర తంత్ర శౌచా లోపాలతో సంభవించే దోషాల నివృత్తికై విధిగా ప్రతి ఏడాది పవిత్రోత్సవాలు శాస్త్రానుసారం నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం 11:11 నిమిషాలకు మహా పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ శ్రీ స్వామివారి పవిత్రోత్సవాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కనక దుర్గ అమ్మవారి దేవస్థానం అర్చకుడు రంగావజ్జల శ్రీనివాస శాస్త్రి, వేద పండితులు, అమరేశ్వరస్వామి దేవస్థానం అర్చకుడు కైతేపల్లి సుధీర్ శర్మ, స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖర్ శర్మ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.